క్లుప్తంగా

కూటమి పాలనలో విద్యా వ్యవస్థ నిర్వీర్యం

వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు సురేష్

రేపల్లె రూరల్: కూటమి పాలనలో విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయ్యిందని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు శౌంటి సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గత ఐదేళ్ల జగనన్న పాలనలో విద్యా వ్యవస్థకు పెద్దపీట వేసి విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేశారన్నారు. ప్రస్తుత కూటమి పాలనలో ప్రభుత్వ పాఠశాలలు కునారిల్లుతున్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 10వ తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం ఈ ఏడాది గణనీయంగా తగ్గటమే దీనికి నిదర్శనమన్నారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన పేటేరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం తీవ్రంగా తగ్గిందన్నారు. గత ఏడాది 98 శాతం ఉత్తీర్ణత సాధిస్తే ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతి నుంచి 127 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 40 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాలేదన్నారు. కేవలం 68.5 శాతం ఉత్తీర్ణత నమోదయిందని వెల్లడించారు. ఫలితాల తగ్గుదలకు కారణం ఎవరని ప్రశ్నించారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం



బాపట్ల: పట్టణంలోని మహర్షి ఆశ్రమ గోశాలలో హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమంలో 45 రోజుల దీక్షపూర్తి అయిన సందర్భంగా ఆదివారం సువర్చల సహిత ప్రసన్నాంజనేయస్వామి వారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం గోపూజ, రామదూత హనుమాన్ మూల మంత్ర హోమం, సువర్చల సహిత ప్రసన్నాంజనేయస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమం బి.బాబు నాగేంద్ర, వంశీ అవధాని, రవితేజ అవధాని, పర్యవేక్షణలో జరిగింది. స్వామి వారి తరఫున మలిశెట్టి బాలాజీ, భ్రమరాంబ దంపతులు, అమ్మవారి తరఫున బూర్ల శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మి దంపతులు కన్యాదాతలుగా ఉండి కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

నేటి నుంచి గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరం

గ్రంథాలయాధికారి వై.రాంబాబు

కొల్లూరు : విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు వీలుగా సోమవారం నుంచి కొల్లూరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి వై.రాంబాబు ఆదివారం తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు జూన్ 6వ తేదీ వరకు విజ్ఞాన శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. శిబిరంలో చిన్నారులకు పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, పెద్దల నుంచి అముద్రిత కథలు వినిపించడం, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. చిన్నారులను గ్రంథాలయానికి పంపి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులను ఆయన కోరారు.

పాలిసెట్ పరీక్షకు నాలుగు కేంద్రాలు

రేపల్లెరూరల్: పాలిసెట్ పరీక్షకు పట్టణంలో నాలుగు పరీక్ష కేంద్రాలు సిద్ధం చేసినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీన పాలిసెట్ పరీక్ష జరగనుందన్నారు. పట్టణంలోని భాష్యం స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రామకృష్ణ ఇంగ్లీషు మీడియం స్కూల్, ఎస్ఎస్‌బీటీ డిగ్రీ కళాశాలలో పరీక్ష నిర్వహణకు అన్ని వసతులు కల్పించామన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందుగానే హాల్ టికెట్‌తో కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకుని ఫీజు చెల్లింపులో ఇబ్బందులు ఎదుర్కొన్న విద్యార్థులు ఈ నెల 29వ తేదీ సాయంత్రంలోగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 8096555306, 8978421087 నంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు సత్కారం



రేపల్లె రూరల్: పేటేరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2024–25 సంవత్సరంలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను గ్రామ పంచాయతీ పెద్దలు అభినందించారు. అత్యధిక మార్కులు సాధించిన గూడపాటి పూర్ణ సుధీర్ 588, కాగిత సుధీర్ 580, విన్నకోట షణ్ముఖ దుర్గారామ్ 570లను గ్రామ సర్పంచ్ కనపర్తి వసుమతి, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులను సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకర్‌రావు, పెద్దలు కనపర్తి రవికిరణ్ తదితరులు ఉన్నారు.

వీళ్ల దాహం తీరనిది..!

● తీర ప్రాంతంలో మత్స్యకార కుటుంబాల ఇబ్బందులు ● బిందె నీళ్లు పది రూపాయిలు
● ట్యాంకర్లతో సరఫరా చేయాలని కోరుతున్న గ్రామస్తులు

అదంతా సముద్ర తీర ప్రాంతం. ఆ ప్రాంతంలోని గ్రామాలన్నీ దాదాపు మత్స్యకార గ్రామాలు. అక్కడ నివసించేది మత్స్యకార కుటుంబాలు. సాధారణంగా తీర ప్రాంతంలో వీచే ఉప్పు గాలులకు దాహం ఎక్కువగా ఉంటుంది. దీంతో నీటి వాడకం అధికంగా ఉంటుంది. అసలే తీర ప్రాంతం, ఆపై వేసవి కాలం కావడంతో నీటి కోసం తీర ప్రాంత ప్రజల బాధలు అన్నీ ఇన్నీ కావు. వాళ్ల దాహార్తి తీరని బాధగా మిగిలిపోతోంది.



నీటి కోసం కుళాయి వద్ద బిందెలు పెట్టిన రామచంద్రపురం ప్రజలు

బాపట్ల: మండలంలోని తీర ప్రాంత ప్రజలు దాహం కేకలు వేస్తున్నారు. అరకొరగా చేస్తున్న నీటి సరఫరా గొంతు తడుపుకోవటానికి సరిపోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిందె రూ.10 చెల్లించి నీళ్లు కొనుకుంటున్నామని చెబుతున్నారు. ఉప్పు గాలులకు నీటి వాడకం ఎక్కువగా ఉన్నప్పటికీ ఇసుకలో దూరప్రాంతాలకు వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. మండలంలోని రామచంద్రపురం, పాండురంగాపురం, అడవిపల్లిపాలెం, విజయలక్ష్మీపురం, దాన్వాయ్‌పేట, కృపానగర్ గ్రామాల్లో ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడవి పంచాయతీ నుంచి అరకొరగా నీటి సరఫరా జరుగుతున్నప్పటికీ ఆ నీరు వారి కనీస అవసరాలకు కూడా సరిపోకపోవటంతో బాపట్ల, చీరాల నుంచి వచ్చే ట్యాంకర్ల వద్ద బిందె రూ.10 వెచ్చించి నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. రామచంద్రపురంలో ఉన్న సిన్‌టెక్స్ ట్యాంకు కూడా దాదాపు ఆరు నెలల క్రితం విరిగిపోయింది. దీంతో అది నిరుపయోగంగా పడి ఉంది. భూగర్భ జలాలు కటిక ఉప్పులు కావటంతో అవి ఎందుకు పనికిరాకుండా పోయాయి. గత ప్రభుత్వం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసిందని, కానీ ఇప్పుడు ప్రభుత్వం పట్టించుకోవటం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని, అలాగే దాతలు ఎవరైనా సహకరించి మత్స్యకార గ్రామాల్లో తాగు నీటి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు కోరుతున్నారు.

అదనంగా వచ్చేలా చూడాలి



తాగు నీటి సరఫరా అరకొరగానే జరుగుతుంది. కనీసం రెండు బిందెలు నీళ్లు కూడా రావటం లేదు. నీటి కోసం చాలా దూరం వెళ్లాల్సి వస్తోంది. బిందె నీళ్లు రూ.10 పెట్టి కొనుక్కోవాల్సి వస్తోంది. ప్రతి రోజు అదనంగా నీరు వచ్చేలా చూడాలి.

– పోలమ్మ, రామచంద్రపురం

దాతలు సహకరించాలి



ఎవరైనా దాతలు మా బతుకులు మార్చేందుకు సహకరించాలి. కనీసం రోజుకు నాలుగు బిందెల నీళ్లు ఇచ్చేందుకు ముందుకు రావాలి. నీళ్లు లేకపోవటంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. ట్యాంకర్లతోనైనా నీటిని సరఫరా చేసి ఆదుకోవాలి.

– లక్ష్మమ్మ, విజయలక్ష్మీపురం

మైనర్లే డ్రైవర్లు..!



యడ్లపల్లిలో ఇటుక రాయి ట్రాక్టర్ నడుపుతున్న మైనర్

చుండూరు(వేమూరు): ట్రాక్టర్లు మైనర్ యువకులు నడుపుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేమూరు నియోజకవర్గంలోని కొల్లూరు మండలంలో ఇసుక, ఇటుక రాయి వ్యాపారం జరుగుతుంది. ఇసుక, ఇటుక ఇతర గ్రామాలకు తరలించేందుకు ట్రాక్టర్లను మైనర్‌లు నడుపుతున్నారు. మైనర్ యువకులు అతి వేగంగా ట్రాక్టర్ నడపడం వల్ల ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోని ప్రజలు భయపడుతున్నారు. ఇటుకను కొల్లూరు మండలంలోని లంక గ్రామాల్లో ఇటుక పరిశ్రమ నుంచి చుండూరు మండలంలోని యడ్లపల్లి గ్రామానికి ట్రాక్టర్ల ద్వారా తీసుకెళుతున్నారు. ఇసుక, ఇటుర రాయి ట్రాక్టర్లు మైనర్‌లు నడుపుతున్నా పోలీసులు, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. మైనర్లు ట్రాక్టర్లు నడపకుండా చర్యలు తీసుకోవాని ప్రజలు కోరుతున్నారు.

అమర్తలూరులో అన్నదానం



అమర్తలూరు(వేమూరు): పేదలకు అన్నదానం చేయడం మహా భాగ్యమని ఎంపీపీ రాపర్ల నరేంద్ర అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమర్తలూరు గ్రామానికి చెందిన గడ్డిపాటి ప్రభాకరావు తల్లి ఆది శేషారత్నం జ్ఞాపకార్థం ప్రభాకరావు కుటుంబ సభ్యులు గ్రామంలో రెండు వేల మందికి అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి అన్నదానం నిర్వహిస్తున్నారన్నారు. గ్రామంలో ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రభాకరావు మాట్లాడతూ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి అన్నదాన కార్యక్రమం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మైనేని రత్నప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



బాపట్ల: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన బాపట్ల మండలం ముత్తాయపాలెం సమీపంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. బాపట్ల పట్టణం పటేల్‌నగర్ రెండవ లైనుకు చెందిన పెరుమాళ్ల అజయ్‌కుమార్, బాపట్ల మండలం రామ్‌నగర్‌కు చెందిన దండుప్రోలు కృపారావు (35) కారులో రామ్‌నగర్ వెళుతుండగా ముత్తయపాలెం వద్ద కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీ కొనటంతో స్తంభం విరిగిపోగా కారు పల్టీలు కొట్టింది. దీంతో దండుప్రోలు కృపారావు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలైన పెరుమాళ్ల అజయ్‌కుమార్‌ను స్థానికులు 108లో ఏరియా వైద్యశాలకు తరలించగా మెరుగైన చికిత్స కొసం చీరాలలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. నగరంలోని ఈషా మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్యులు డాక్టర్ ఎం.నరేంద్రరెడ్డి, డాక్టర్ ఎం.హర్షవర్ధన్, డాక్టర్ కె.శంకర్‌రెడ్డిలు సుమారు 300 మందికి ఉచితంగా బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు తదితర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా అబాకస్ యూసీమాస్ వార్షికోత్సవం



బహుమతుల ప్రదానం చేస్తున్న దృశ్యం

తెనాలి: శ్రీసాయి అబాకస్ తెనాలి యూసీమాస్ 18వ వార్షికోత్సవం ఆదివారం స్థానిక హోటల్ గౌతమ్‌గ్రాండ్‌లో ఘనంగా నిర్వహించారు. ప్రస్తుత సంవత్సరానికి గుంటూరు డిస్ట్రిక్ట్, స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లెవల్, నేషనల్, ఇంటర్నేషనల్ లెవల్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. గుంటూరు యూసీమాస్ ప్రధాన కార్యాలయం నుంచి ముఖ్య అతిథిగా వచ్చిన శ్రీకాంత్ విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అబాకస్‌ను మంచి వాతావరణంలో శ్రద్ధతో నేర్చుకుని, చక్కని ప్రతిభతో తెనాలికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రముఖ న్యాయవాది హరిదాస్ గౌరీశంకర్ విచ్చేసి బహుమతులు అందజేసి, గెలిచిన విద్యార్థులు, ప్రోత్సహించిన వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఏవ కంటే వేగంగా అబాకస్‌తో విద్యార్థులు ప్రాబ్లమ్స్‌ను పరిష్కరిస్తారని చెప్పారు. నిర్వాహకులు, తెనాలి ఫ్రాంఛైజీ డైరెక్టర్ సుధా మాధవ్ మాట్లాడారు. ఇంటర్నేషనల్ లెవల్‌లో మంచి కాంపిటేటర్స్‌గా నిలవాలని విద్యార్థులకు సూచించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టర్ అశోక్, డాక్టర్ మంజుల, రజని తదితరులు పాల్గొన్నారు.


బులియన్, బార్ అసోసియేషన్ కార్యవర్గానికి సన్మానం



బాజీ, ఖాశిం, బాజీ బాబాలను సన్మానించిన అంజుమన్ కమిటీ

పొన్నూరు: పట్టణంలోని ఎ.పి.జె అబ్దుల్ కలాం షాదీఖానాలో ఆదివారం అంజుమన్ కమిటీ కార్యవర్గం మొదటి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి అంజుమన్ అధ్యక్షుడు మగ్బుల్ బేగ్ అధ్యక్షత వహించారు. అంజుమన్ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. అనంతరం ఇటీవల పొన్నూరు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన షేక్ బాజీ, బులియన్ మర్చంట్ అసోసియేషన్ కార్యదర్శి షేక్.బాజీ బాబా, కోశాధికారి మహమ్మద్ ఖాసింలను ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పొన్నూరు అంజుమన్ కమిటీ కార్యదర్శి షేక్. బాజ్జీ, కోశాధికారి మహమ్మద్ గౌస్, సంయుక్త కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

5వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష



నెహ్రూనగర్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి ఘటనపై సీబీఐతో సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్(ఐక్య) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ప్రారంభించిన క్రైస్తవుల రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి ఐదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మద్దు ప్రేమజ్యోతిబాబు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో క్రైస్తవ మిషనరీలు, పాస్టర్లు, చర్చిలపై అనేక దాడులు జరుగుతున్నాయని వీటిని అరికట్టాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల నాయకులు కొండపల్లి విల్సన్, శరత్‌బాబు, బాబురావు, బండ్ల కాంతారావు, రాజు, యిర్మియా పాల్గొన్నారు.

రన్నింగ్ ట్రైన్ ఎక్కుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలు

బాపట్ల: కదులుతున్న రైలు ఎక్కుతుండగా వ్యక్తికి తీవ్ర గాయాలయిన ఘటన బాపట్లలో శనివారం రాత్రి జరిగింది. చీరాల నుంచి ఖమ్మంకు సింహపురి రైలులో వెళ్తూ.. బాపట్ల రైల్వే స్టేషన్‌లో మంచినీటి కోసం దిగి తిరిగి రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కింద పడి షార్వాన్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. రన్నింగ్ ట్రైన్ ఎక్కుతుండగా ప్లాట్ ఫాంపై పడి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే జీఆర్‌పీ కానిస్టేబుల్ పావని అతనిని వైద్యం నిమిత్తం గుంటూరుకు తరలించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన వ్యక్తులపై కేసు

తెనాలిరూరల్: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని కొలకలూరుకు చెందిన మల్లవరపు విజయ్, ఉన్నం రవి, మరి కొంతమంది శనివారం సాయంత్రం మద్యం తాగి, గ్రామ పెద్ద కాల్వ వంతెనపైన స్కూలు, కాలేజీ బస్సులు, ఇతర వాహనాలను అటకాయించి, డ్రైవర్లపై దురుసుగా ప్రవర్తించారు. అంతేకాక వాహనాల రాకపోకలను సుమారు 30 నిమిషాలు అడ్డుకున్నారు. పబ్లిక్ స్థలంలో ప్రజలకు ఇబ్బంది కలిగించడంతో వారిపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ కె.ఆనంద్ ఆదివారం తెలిపారు.

మే 20న సమ్మెను జయప్రదం చేయాలి

సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్



మాట్లాడుతున్న సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్

రేపల్లె రూరల్: కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ అమల్లోకి తెస్తున్న లేబర్ కోడ్‌లను నిరసిస్తూ మే 20వ తేదీన జరగనున్న దేశ వ్యాప్త సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షులు సీహెచ్ మణిలాల్ పిలుపునిచ్చారు. పట్టణంలోని స్థానిక కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్మిక సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం కాలరాసి కార్మికులను బానిసలుగా చేసేందుకు కుట్ర పన్నుతుందన్నారు. కార్మికుల 8 గంటల పని విధానానికి తిలోదకాలు ఇస్తూ 10 నుంచి 14 గంటలు పని చేయించేలా లేబర్ కోడ్‌లను అమలులోకి తెస్తుందని విమర్శించారు. అంతేకాక కార్మికులు నిరసన తెలిపే హక్కును కోల్పోయే విధంగా చట్టాలను రూపొందిస్తుందన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు జరిగే సమ్మెలో కార్మికులు పాల్గొని నిరసనను వ్యక్తం చేయాలని తెలిపారు. మే 1వ తేదీన మే డేను ఘనంగా నిర్వహించాలని కోరారు. సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు జె.ధర్మరాజు, నాయకులు డి.ప్రభాకర్‌రావు, ప్రసాదు, కె.రాము, వై.వాసు, బి.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం రోగులకు భోజనాన్ని అందించండి

జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి



రోగులకు అల్పాహారాన్ని పంపిణీ చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి

తెనాలిఅర్బన్: రోగులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి సూచించారు. వైద్యశాలలో రోగులకు అల్పాహారం, భోజనాన్ని అందించేందుకు ఒంగోలుకు చెందిన వెంకటేశ్వర ఏజెన్సీ కాంట్రాక్ట్ దక్కించుకోవడంతో ఆదివారం వారు తెనాలి వచ్చారు. ఆమె మాట్లాడుతూ జిల్లా వైద్యశాలలో డైట్ కాంట్రాక్ట్‌కు ఇటీవల జిల్లా జాయింట్ కలెక్టర్ టెండర్లు పిలిచారని తెలిపారు. నూతన టెండర్‌దారుడు ఆదివారం నుంచి అల్పాహారం, భోజనాన్ని వారు అందిస్తున్నట్లు చెప్పారు. వీరి కాంట్రాక్ట్ రెండేళ్లపాటు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌వో డాక్టర్ మల్లికార్జునరావు, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడికి శస్త్ర చికిత్స

గుర్తు తెలియని సుమారు 70 సంవత్సరాలు ఉన్న వృద్ధుడు ఈనెల 26వ తేదీన జిల్లా వైద్యశాలకు వచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న అతనికి వైద్యులు చికిత్స అందించారు. ఆ సమయంలో కుడికాలు విరిగినట్లు గమనించారు. సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ జె.హనుమంతరావు పర్యవేక్షణలో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఎనస్తీషియా వైద్యులు డాక్టర్ ఎస్ఎస్‌వీలు అతడికి ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం ఆరోగ్యం మెరుగుపడినట్లు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి తెలిపారు. అతడి వివరాలు తెలిస్తే వెంటనే మాకు సమాచారం అందించాలని సూచించారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో సీఎంఈ



డాక్టర్ శ్రీహరిరావును సత్కరిస్తున్న తెనాలి వైద్యులు

తెనాలిరూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తెనాలి శాఖ, తక్కెళ్ళపాడు కిమ్స్ చక్ర క్యాన్సర్ సెంటర్ సంయుక్తంగా బోస్‌రోడ్డులోని శ్రీమతి శ్యామల రత్తమ్మ, డాక్టర్ మేజర్ కాకుమాను వుళ్ళక్కి మెమోరియల్ ఐఎంఏ హాలులో కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్(సీఎంఈ) కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ వైద్యమండలి రాష్ట్ర మాజీ వైస్‌చైర్మన్, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్యాన్సర్ రకాలు, వ్యాధి నిర్ధారణ, చికిత్స వంటి అంశాలపై కిమ్స్ చక్ర హాస్పిటల్ నుంచి వచ్చిన బృందం డాక్టర్ సుమన్ ఉడత, డాక్టర్ యశ్వంత్ పామిడి, డాక్టర్ అనూష , డాక్టర్ మహతి, డాక్టర్ శ్రీ ఫణి, డాక్టర్ రాము కందుల వివరించారు. ఐఎంఏ తెనాలి అధ్యక్షుడు డాక్టర్ కావూరు అనిల్ కుమార్, డాక్టర్ మధు ప్రభాకర్ బాబు, డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్ శ్యాం ప్రసాద్, డాక్టర్ దక్షిణామూర్తి, డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ కోటి నాగయ్య, డాక్టర్ గంటా నరసింహారావు, డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ హనుమంతరావు తదితర తెనాలి ప్రముఖ వైద్యులతో పాటు పొన్నూరు, గుంటూరు, రేపల్లె, చెరుకుపల్లికి చెందిన పలువురు వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీహరిరావును సత్కరించారు.

కనులపండువగా అద్దంకమ్మ తిరునాళ్ల



వట్టిచెరుకూరులో సిడిమాను ఊరేగింపు



లక్ష గాజులతో విశేష అలంకరణలో అమ్మవారు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరులో కొలువుదీరిన అద్దంకమ్మ తల్లి తిరునాళ్ల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అద్దంకమ్మ తల్లికి ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారిని లక్ష గాజులతో విశేషంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. సాయంత్రం నిర్వహించిన సిడిమాను ఉత్సవం కనుల పండువగా సాగింది. అశేష భక్తజనుల నడుమ సిడిమానును ఘనంగా ఊరేగించారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

గుంటూరు రూరల్: వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి డ్రైవర్‌కు గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. చిలకలూరిపేట నుంచి గుంటూరు వస్తున్న కారు చౌడవరం వంతెన వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో కారు వంతెన పైనుంచి కిందపడి నుజ్జునుజ్జు అయ్యింది. డ్రైవర్‌కు గాయాలవ్వడంతో స్థానికులు చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఉదయం సమయంలో హైవేపై ఎటువంటి వాహనాలు రాకపోవటంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై నల్లపాడు పోలీసులకు అడుగగా ఎటువంటి సమాచారం లేదని అన్నారు.

ఇది దళిత వ్యతిరేక ప్రభుత్వం

నెహ్రూనగర్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నియోజకవర్గంలో కాపు కులస్తులు, దళితులను వెలివేస్తే పవన్ కళ్యాణ్ ఒక్క మాట మాట్లాడకపోవడం సిగ్గుచేటని ఈ ప్రభుత్వం దళిత వ్యతిరేక ప్రభుత్వమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చందోలు శశికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కుల వివక్షకు గురై వెలివేయబడిన దళితుల సాంఘిక బహిష్కరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు సుమోటోగా క్రిమినల్ కేసును స్వీకరించడం హర్షించదగ్గ విషయమని చెప్పారు.